క్లుప్తంగా

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు



వాహనాల పత్రాలను పరిశీలిస్తున్న సీఐ గిరిబాబు

ఉదయగిరి: తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ గిరిబాబు, ఎస్సై ఎస్.ప్రభాకర్ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా వారు మంగళవారం స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారుడు లైసెన్సు కలిగి వాహన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడిపినా, అధిక లోడుతో వెళ్లినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదు

కావలిరూరల్: కావలి మున్సిపాలిటీలో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని 2, 3 వార్డులను మంగళవారం తెల్లవారుజామున సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రజలు ఎక్కడా పారిశుద్ధ్యం, నీటి సమస్యలతో ఇబ్బందులు పడకూడదని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశించారని, అందుకు తగినట్లు ప్రత్యేకాధికారి, ఆర్డీఓ శీనానాయక్ సూచనల మేరకు పారిశుద్ధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే ప్రతి రోజూ ఉదయం పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్నామన్నారు. దోమలు ప్రబలకుండా ఫాగింగ్ యంత్రాలతో ఫాగింగ్ చేయిస్తున్నామని, మురుగు కాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నామని, బ్లీచింగ్ చల్లిస్తున్నామని తెలిపారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

వింజమూరు: స్థానిక శ్రీనేతాజీ వికాస్ జూనియర్ కళాశాలలో మంగళవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరప్రసాద్ మాట్లాడుతూ నిరంతరం లక్ష్యసాధన కోసం ప్రయత్నించాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ రత్నం, డైరెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, హెచ్‌ఎం ఎ.గురుస్వామి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

వరికుంటపాడు: మండలంలోని గణేశ్వరపురం గ్రామానికి చెందిన సింగంరెడ్డి వీరరాఘవులు మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన నేపథ్యంలో అతని భార్య వెంకటరమణమ్మకు వైఎస్సార్ బీమా పథకం కింద ప్రాథమిక ఖర్చుల నిమిత్తం రూ.10 వేల నగదును మంగళవారం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రాజేష్ అందజేశారు. మిగతా నగదును చెక్కు రూపంలో త్వరలో అందజేస్తామని తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం

వరికుంటపాడు: స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం ఎంపీపీ జి.వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై చర్చించేందుకు వీలుపడని కారణంగా మరోసారి నిర్వహించే సమావేశంలో చర్చించుకుందామని తెలిపి సభను ముగించారు. మండల ఉపాధ్యక్షుడు దేవనబోయిన మధు, జెడ్పీటీసీ సభ్యుడు రావిళ్ల నాగేంద్ర మాట్లాడుతూ తరచుగా ఏదో ఒక కారణాలతో సర్వసభ్య సమావేశాన్ని వాయిదాలు వేస్తూ ముగిస్తున్నారని, ఇలా చేయడం వల్ల మండలానికి వచ్చిన నిధులు ఖర్చుచేయలేక వృథా అయ్యే అవకాశం ఉందన్నారు. సమావేశంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

కొండాపురం: కొండాపురం నుంచి నేకునాంపేటకు ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న 20 మద్యం బాటిళ్లను కలిగిరి ఎస్ఈబీ అధికారులు మంగళవారం మధ్యాహ్నం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ ఇన్‌చార్జి సీఐ అశోక్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు నేకునాంపేట గ్రామానికి చెందిన షేక్ సాబ్‌జాన్ అనే వ్యక్తి మద్యం బాటిళ్లు తరలిస్తున్నాడని సమాచారం అందడంతో రేణమాల - నేకునాంపేట మధ్య ఆర్టీసీ బస్సును తనిఖీ చేయగా అతని వద్ద 20 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వెంటనే అతనిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు.

విద్యార్థులకు అభినందన

కొండాపురం: ఉదయగిరి నియోజకవర్గ స్థాయిలో వింజమూరులో జరిగిన గ్రిగ్స్ మెమోరియల్ టోర్నమెంట్–2023లో వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన, ప్రతిభ కనబరిచిన కొండాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను మంగళవారం ఆ పాఠశాలలో హెచ్‌ఎం అబ్దుల్ రహీం, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ ఉదయభాస్కర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మనాభరావు, శ్రీలలిత, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల తంటా

- పుచ్చ పంటకు ఆశిస్తున్న దోమ, పేను బంక, వైరస్, పండాకు తెగుళ్లు
- గిడసబారిపోతున్న పుచ్చకాయలు
- ఆవేదన చెందుతున్న రైతులు



జువ్విగుంటపాలెంలో తెగులు సోకిన పుచ్చపంట

కావలి: పుచ్చపంటకు ఆశిస్తున్న తెగుళ్లతో రైతులు అవస్థలు పడుతున్నారు. కావలి, బోగోలు మండలాల్లోని తీరప్రాంత గ్రామాల్లో సాగవుతున్న పుచ్చ పంటకు తెగుళ్ల బెడద అధికమైంది. వాతావరణ మార్పులు, చలితో వైరస్ తెగుళ్లు విజృంభిస్తున్నాయి. ఇసుక నేల ఎక్కువగా ఉండే తుమ్మలపెంట, కొత్తసత్రం, అన్నగారిపాలెం, జువ్విగుంటపాలెం, చెన్నాయపాలెం, మన్నంగిదిన్నె గ్రామాలు, బోగోలు మండలంలోని సిద్ధవరపు వెంకటేశ్వరపాలెం, జువ్వలదిన్నె, ఏనుగులబావి, కోళ్లదిన్నె తదితర గ్రామాలతోపాటు తీరప్రాంత గ్రామాల్లోనూ సుమారు 2,500 ఎకరాల్లో రైతులు పుచ్చ సాగు చేస్తున్నారు. గతేడాది పుచ్చకు మంచి ధర పలికి లాభాలు రావడంతో ఈ ఏడాది పంట విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలో అధిక దిగుబడుల కోసం రైతులు ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడులు పెట్టి పుచ్చసాగు చేపట్టారు. వాతావరణంలో మార్పులు, మంచు వాతావరణంతో పంట ప్రారంభం నుంచి రైతులను తెగుళ్లు వెంటాడాయి. దీంతో కాయలు పెద్దసైజు రావడం లేదు. తెగుళ్లతో పిందె దశలోనే కాయలు గిడసబారి పోతుండడం, పురుగుమందులు పనిచేయక పోవడంతో దిగుబడులు తగ్గిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దఫా ధరలు కూడా ఆశాజనకంగా లేవని ఆందోళన చెందుతున్నారు.

తీరంలోనే అధికం

తీరంలో సాగు చేస్తున్న పుచ్చపంటకే తెగుళ్ల బెడద ఎక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు. తుమ్మలపెంట, కొత్తసత్రం, అన్నగారిపాలెం, జువ్విగుంటపాలెం, చెన్నాయపాలెం, జువ్వలదిన్నె తదితర గ్రామాల్లో సాగు చేస్తున్న పుచ్చపంటకు దోమ, పేనుబంక, వైరస్ తెగులు, పండాకు తెగులు ఆశించాయి. పుచ్చలో మొజాయిక్ వైరస్ కారణంగా తీగ చివర ఎదుగుదల నిలిచిపోయి తీగంతా ఉండ చుట్టుకుపోతుంది. కాయ పెరుగుదల నిలిచిపోయి ఉత్పత్తి దారుణంగా పడిపోతుంది. పండాకు తెగులు కారణంగా ఆకులన్నీ పండిపోయి తీగ ఎండిపోతుంది. తీగకు ఉన్న కాయలు కూడా వంకర్లు తిరిగి రుచి లేకుండా పోతున్నాయని రైతులు వాపోతున్నారు. తెగులు తీవ్రతను బట్టి ఎకరాకు 30 నుంచి 60 శాతం దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పుచ్చ సాగవుతున్న మండలాలు
కావలి, బోగోలు
ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న విస్తీర్ణం - 2,500 ఎకరాలు



పండాకు తెగులు సోకి పండిపోతున్న ఆకులు

మందులు వాడినా తెగుళ్లు తగ్గడం లేదు



ఈ దఫా పుచ్చ పంటకు తెగుళ్లు ఎక్కువగా వస్తున్నాయి. పండు తెగులు, వైరస్ తెగులు ఎక్కువగా ఉన్నాయి. ఎన్ని మందులు వాడినా ఫలితం కనిపించడం లేదు. తెగుళ్ల కారణంగా పెట్టుబడులు కూడా పెరుగుతున్నాయి.

– మైనంపాటి మధు, రైతు, జువ్విగుంటపాళెం

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి



పుచ్చ రైతులు సమగ్ర యాజమాన్య చర్యలు అవలంభిస్తే సులువుగా తెగుళ్ళ నివారణ సాధ్యమవుతుంది. మొజాయిక్, పండు తెగులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో పర్యటించి రైతులకు తగిన సూచనలిస్తున్నాం. సోమవారం కూడా తాళ్లపాళెం తదితర గ్రామాల్లో పర్యటించి పుచ్చపంటను పరిశీలించాం. ప్రధానంగా వైరస్ తెగుళ్లకు వాహకాలుగా పనిచేసే దోమ, తామరపురుగుల నివారణకు జిగురు అట్టలు వినియోగించడం, చుట్టుపక్కల కలుపు మొక్కలు నివారించడం ద్వారా కొంతమేర ఫలితం ఉంటుంది. వైరస్ తెగులు ఆశించిన మొక్కలను పంట నుంచి వేరు చేసి తగలబెట్టాలి. తెగుళ్ల తీవ్రతను బట్టి డైమోథోయేట్ 2 మిల్లీ లీటర్లు లేదా థైమోమిథాక్సమ్ 3 మిల్లీలీటర్ల వంతున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

– సుధామయి, కావలి ఉద్యానవన శాఖాధికారిణి

పురస్కారాల రిజిస్ట్రేషన్‌కు ఏప్రిల్ 29న ఆఖరు

ఉదయగిరి: ఇంజినీరింగ్ విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరచిన కళాశాలలు, అధ్యాపకులు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందించనున్న క్రమంలో వివిధ భాగాలకు సంబంధించి రిజిస్ట్రేషన్‌కు ఏప్రిల్ 29న ఆఖరు అని సొసైటీ ఫర్ ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్ ఇండియా ప్రెసిడెంట్ చందు రవిశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది ఈ సొసైటీ ఆధ్వర్యంలో పురస్కారాలు అందిస్తున్నామని, ఈ ఏడాది దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరుతో ఈ పురస్కారాలు ప్రదానం చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే మేకపాటికి పరామర్శ



ఉదయగిరి: ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకొని మర్రిపాడులోని తన అతిథి గృహంలో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని మంగళవారం ఉదయగిరి బీఎంసీబీ చర్చి ప్రతినిధులు కలిసి పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని పాస్టర్ సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ప్రసాదరావు, ఆనందరావు, బకీరు జాషువా, రాబర్ట్, శ్రావణ్, ఆరోన్ తదితరులు పాల్గొన్నారు.

గౌతమన్న సేవలు మరువలేనివి



ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..



ఉదయగిరి: గౌతమ్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు



సంగం: మేకపాటి గౌతమ్‌రెడ్డికి సంగం బ్యారేజ్ వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆత్మకూరురూరల్: గౌతమ్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సంగం: దివంగత మంత్రి మేకపాటి గౌతమన్న సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ నేతలు కొనియాడారు. సంగం వద్ద పెన్నానదిపై నిర్మించిన మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్ వద్ద ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి విగ్రహాలకు గౌతమ్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ సంగం నేతలు మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కంటాబత్తిన రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే వెంగారెడ్డిపాళెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, ఉదయగిరిలో మేకపాటి గౌతమ్‌రెడ్డి సమాధి వద్ద ఎంపీటీసీ సభ్యుడు ముడి మల్లికార్జునరెడ్డి, నాయకుడు మెట్టుకూరు వాసుదేవరెడ్డి, కర్నాటి రవీంద్రరెడ్డి నాయకులతో వెళ్లి గౌతమ్‌రెడ్డికి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ అధ్యక్షుడు పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దేవసహాయం, గుండాల బాలచంద్రారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, రావుల ప్రసాద్‌గౌడ్, కరిముల్లా, ఫణికుమార్‌రెడ్డి, సర్పంచ్ మానికల చందన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..

ఆత్మకూరు: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, సీనియర్ నాయకుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య ఆధ్వర్యంలో గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు విజయజ్యోతి, మహబూబ్‌బాషా, గంధళ్ల వేణు, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కేతా రవి, సయ్యద్ జమీర్, కలాం, ఎస్.ప్రతాప్, బాలచెన్నయ్య, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేతల నివాళి

ఆత్మకూరురూరల్: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామమైన బ్రాహ్మణపల్లిలో మంగళవారం జరిగిన కార్యక్రమాలకు ఆత్మకూరు మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఆయన చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు.

ఆదూరుపల్లిలో..

చేజర్ల: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా మండలంలోని ఆదూరుపల్లిలో జెడ్పీటీసీ సభ్యుడు పీర్ల పార్థసారథి ఆధ్వర్యంలో గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బి.వీరరాఘవరెడ్డి, పి.బాలగంగాధర్‌రెడ్డి, వీరరాఘవరెడ్డి, నాగిరెడ్డి, షేక్ దావూద్, పి.చంద్రశేఖర్‌రెడ్డి, వావిలేరు సర్పంచ్ రాంబాబు, శేఖర్‌రెడ్డి, ఎ.చిరంజీవిరెడ్డి, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాల ఆవరణలో..

ఉదయగిరి: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని వ్యవసాయ కళాశాల ఆవరణలో ఎంజీఆర్ ఘాట్ వద్ద కుటుంబసభ్యులు, స్థానికులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు చేపట్టి గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేకపాటి గౌతమ్‌రెడ్డి తల్లి మణిమంజరి, బాబాయి మేకపాటి రాజారెడ్డి, పిన్ని తులశమ్మ, సోదరి ఆదాల రచనారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, ప్రిన్సిపల్ డాక్టర్ మనోజ్‌కుమార్‌రెడ్డి, జేవీవీ నాయకులు ఫారుఖ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో..

మర్రిపాడు: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నాయకులు ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జి.శ్రీనివాసులునాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఎస్.మాధవరెడ్డి, నారాయణస్వామి, ఓబులేసు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌పేటలో..

అనుమసముద్రంపేట: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏఎస్‌పేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పులిమి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ కె.హజరత్తమ్మ, మాజీ కోఆప్షన్ సభ్యుడు రియాజ్ అహ్మద్, నాయకులు కె.తిరుపతిరెడ్డి, కె.శ్రీనివాసులునాయుడు, ఎ.కొండారెడ్డి, జి.శ్రీనివాసులురెడ్డి, షేక్ జకీర్‌బాషా, ముజీర్‌ఖాన్, ఇలియాజ్ అహ్మద్, ఖాదర్‌బాషా, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడులో..

సోమశిల: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం అనంతసాగరం మండలం వరికుంటపాడులో జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గౌతమ్‌రెడ్డికి ఘన నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.సంపూర్ణమ్మ, సర్పంచ్ ఆర్.ఇంద్రావతమ్మ, నాయకులు టి.రాజగోపాల్‌రెడ్డి, డి.రత్నారెడ్డి, కె.వెంకటేశ్వర్లురెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మాతృభాషకు సముచిత స్థానం ఇవ్వాలి



సర్టిఫికెట్లు, బహుమతులు అందుకున్న విజేతలు



ఆత్మకూరురూరల్: కనుపూరుపల్లిలో..

- ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

ఆత్మకూరు: మాతృభాషకు సముచిత స్థానం ఇవ్వడంతోపాటు ఇతర భాషలను గౌరవించాలని వక్తలు పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని కాశీనాయన ఆశ్రమ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తెలుగు పద్యాలపై ప్రత్యేక పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో 3, 4, 5 తరగతుల విద్యార్థులు, సీనియర్స్ విభాగంలో 6, 7, 8 తరగతుల విద్యార్థులు సుమారు 400 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు, అలాగే ప్రతిభ కనబరచిన మరికొందరికి పోత్సాహక బహుమతులు అందజేశారు. సమితి అధ్యక్ష, కార్యదర్శులు తెలుగు భాష ఔన్నత్యం, మాతృభాషకు ఇవ్వాల్సిన గౌరవం తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సమితి కార్యనిర్వాహకులు గోవిందరెడ్డి, రామిరెడ్డి, ఎస్‌వీ రమణయ్య, చలమయ్య, సుబ్బరాయుడు, యానాదిరెడ్డి, కేవీ శేషారెడ్డి, వి.నారాయణరావు, వి.సుబ్బయ్య, అపర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాతృభాష తల్లితో సమానం

ఆత్మకూరురూరల్: ప్రతి ఒక్కరికి మాతృభాష తల్లితో సమానమని, మన సంస్కృతితోపాటు భాషను కాపాడుకోవడం చాలా అవసరమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మండలంలోని కనుపూరుపల్లి, ఆరవీడు, మహిమలూరు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేసి, మాతృభాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, నాగేశ్వరరావు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న వెంకటప్రసాద్

ఉదయగిరి: ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి జి.వెంకటప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని గండిపాళెంలో మరమ్మతులు పూర్తయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం వైద్యసేవలందిస్తున్న అద్దె భవనం శిథిలావస్థకు చేరుకోవడంతోపాటు అరకొర వసతులతో సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలో మరమ్మతులు పూర్తిచేసుకున్న నూతన భవనంలో రోగులకు వైద్యసేవలందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు శివకల్పన, వినీత, సీహెచ్‌ఓ శివకుమారి, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీధర్‌బాబు

జలదంకి: అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎంపీడీఓ రవీంద్రబాబు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ జి.వెంకటరమణయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని ప్రజల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తెలిపారు. ఏఓ శైలజ మాట్లాడుతూ వరిసాగు చేస్తున్న రైతులు ఈ నెలాఖరు లోపు ఈ–క్రాప్ నమోదులోపాటు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. హౌసింగ్ ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న లేఅవుట్లలో ఇళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. మండల విద్యాశాఖాధికారి శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఆత్మకూరు: ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం చేస్తున్న నాయకులు

ఆత్మకూరు: త్వరలో జరగనున్న తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థుల తరఫున ఆ పార్టీ నాయకులు ముమ్మర ప్రచారం నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని పలు పాఠశాలలు, దుకాణాల వద్ద, ఇళ్ల వద్ద కొందరిని కలిసి పట్టభద్రుల నియోజకవర్గానికి పోటీ చేస్తున్న సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కుట్టుబోయిన బ్రహ్మానందంలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, నాయకులు కె.సుధాకర్‌రెడ్డి, నలిశెట్టి శ్రీనివాసులు, భరత్, రాజగోపాల్‌రెడ్డి, సీహెచ్ చంద్రశేఖర్, వి.సుధాకర్‌రెడ్డి, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

ఉదయగిరి: ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పీడీఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్లురెడ్డిని గెలిపించాలని కోరుతూ మంగళవారం సీపీఎం నాయకులు పట్టణంలో ప్రచారం నిర్వహించారు. పంచాయతీ బస్టాండ్ సెంటర్, మెయిన్ బజార్ తదితర ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేసి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకుడు కాకు వెంకటయ్య, ఎంపీటీసీ సభ్యురాలు విజయమ్మ, నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

సేవలతో సమాజంలో మార్పు



ఎన్ఎస్ఎస్ క్యాంప్ నిర్వహించిన విద్యార్థులు

ఆత్మకూరురూరల్: విద్యార్థులు చదువులతోపాటు తరచూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సమాజంలో ఆశించదగ్గ మార్పులు వస్తాయని ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వాసుబాబు అన్నారు. మండలంలోని మురగళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జి.వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కలిసి మంగళవారం క్యాంప్ నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రిన్సిపల్ వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రఘురామయ్య, సీనియర్ అసిస్టెంట్ ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



వరి పొలంలో పొలంబడి నిర్వహిస్తున్న ఏడీఏ లక్ష్మీమాధవి

ఉదయగిరి: రైతులు పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడి నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీమాధవి సూచించారు. మంగళవారం మండలంలోని తిరుమలాపురం పంచాయతీ దుంపవారిపల్లిలో వరి పంట సాగుపై నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పంటల సాగులో రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని, తగిన మోతాదులో ఎరువులు, పురుగుమందులు వినియోగించాలని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం నిర్వహిస్తున్న సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో ఏఈఓ రాజశేఖర్, వీఏఏ రంతుల్లా పాల్గొన్నారు.

సాగరం నుంచి చెన్నైకి బస్సు ప్రారంభం



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ కరిమున్నిసాబేగం

సోమశిల: అనంతసాగరం నుంచి చెన్నైకి నూతన బస్సు సర్వీసును ఆత్మకూరు డిపో మేనేజర్ కరిమున్నిసా బేగం మంగళవారం రాత్రి అనంతసాగరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం 7.40 గంటలకు అనంతసాగరం నుంచి బస్సు బయలుదేరుతుందని, తరువాత రోజు తెల్లవారుజామున 5 గంటలకు చెన్నైకి చేరుకుంటుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ బస్సు సర్వీసు ఆత్మకూరు, నెల్లూరు మీదుగా చెన్నైకి చేరుకుంటుందని తెలిపారు. ఆమె వెంట సేఫ్టీ డ్రైవ్ ఇన్‌స్పెక్టర్ హయాత్‌బాషా, సిస్టం సూపర్‌వైజర్ దిలీప్, వెంగళరెడ్డి తదితరులు ఉన్నారు.